www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 10 జులై 2025



నేడు మెగా పేరెంట్స్ డే నిర్వహణకు సర్వ సన్నద్ధం: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డే సమావేశాలను విజయవంతం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రయివేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, విద్యాశాఖాధికారులతో మెగా పేరెంట్స్ డే నిర్వహణపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. జిల్లాలో 1810 ప్రభుత్వ, 558 ప్రయివేటు పాఠశాలలు, 140 జూనియర్ కళాశాలల్లో మెగా పిటిఎంకు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనేలా అంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మెగా పిటిఎం నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆర్ఐఒ యోహాన్, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, సమగ్ర శిక్షా ఎపిసి పంకజ్‌కుమార్, జిల్లాలోని పలు ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలి. లేనిపక్షంలో కార్మిక, కర్షక ఐక్య పోరాటాలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతాం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన పని గంటల ఉత్తర్వులు రద్దు చేయాల్సిందే' అంటూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యాన జిల్లాలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ప్రజలు కదంతొక్కారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మికులు, ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆయా పట్టణాలు, మండల కేంద్రాల్లో పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించిన నిరసన తెలిపారు. అనంతరం నిర్వహించిన సభల్లో లేబర్ కోడ్‌లను ఉపసంహరించి, కార్మిక చట్టాలు అమలు చేసే వరకూ పోరు ఆపేది లేదని ప్రతిన బూనారు.



ఏలూరులో ర్యాలీ

కార్మికుల కన్నెర్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ ,కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగ్రహం

జిల్లాలో సార్వత్రిక సమ్మె విజయవంతం

ర్యాలీల్లో కదంతొక్కిన కార్మికులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే: సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సార్వత్రిక సమ్మె ఏలూరులో విజయవంతంగా సాగింది. వివిధ రంగాల కార్మికులతోపాటు బ్యాంకులు, ఇన్సూరెన్స్, పోస్టల్ ఉద్యోగులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, మెడికల్ రిప్రజెంటేటివ్‌లు, స్కూల్ స్వీపర్లు తదితర రంగాలకు చెందిన కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏలూరులో భారీ ప్రదర్శన నిర్వహించారు. పవర్‌పేట రైల్వే స్టేషన్ నుండి ప్రారంభమైన ప్రదర్శన రమా మహల్ సెంటర్ మీదుగా ఆర్‌ఆర్‌పేట పార్క్ వద్దకు చేరుకుంది. అక్కడ కార్మిక నేతలు డిఎన్‌విడి.ప్రసాద్, బి.వెంకట్రావు, ఆర్.శ్రీనివాసడాంగే అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు బి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్మికవర్గం స్వాతంత్రానికి పూర్వమే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. లేబర్ కోడ్‌లు అమలు చేస్తే కార్మికులు సహించబోరన్నారు. సంపద సృష్టిస్తున్న కార్మికవర్గాన్ని మరోసారి బానిసలుగా మార్చేలా కేంద్ర ప్రభుత్వం ఈ లేబర్ కోడ్స్ తీసుకొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం అంబానీ, అదాని వంటి పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచి పెట్టేందుకే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు చేసిన వాగ్దానాలు అమలు చేయకుండా కార్మిక వర్గాన్ని మోసగిస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ, ఆటో, హమాలీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సభలో ఎఐబిఇఎ నాయకులు శ్రీనివాస మోహన్, ఎల్ఐసి ఎఓఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు, ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపి ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమానికి నాయకులు యర్రా శ్రీనివాసరావు, బి.సోమయ్య, దూళ్ల వీరి నాయుడు, అప్పలరాజు, మంగం అప్పారావు, వివిఎన్.ప్రసాద్, పల్లి గంగరాజు, కాకర్ల శ్రీను, బాబు, హేమశంకర్, వైఎస్.కనకారావు, బి.పద్మ, జె.గోపి, రవికుమార్, ఆలీ తదితరులు నాయకత్వం వహించారు.

జంగారెడ్డిగూడెం: ఉద్యోగ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన బస్టాండ్ వద్ద సభ నిర్వహించారు. సభకు వ్యకాస జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం, ఎఐటియుసి నాయకులు కె.విఘ్నేష్, ఐఎఫ్‌టియు నాయకులు ఏరుబండి వీర్రాజు అధ్యక్షతన జరిగిన సభలో వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను బానిస సమాజం వైపు తీసుకెళ్లాలనే ఆలోచనతో 10, 12 గంటల పని విధానాన్ని అమలు చేయాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నా ఉపాధి అవకాశాలు లేక జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా అంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కెవి.రమణ, ఎఐటియుసి నాయకులు కుంచె వసంతరావు, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.సుభాషిణి, పి.సూర్యారావు, సిపిఐ నాయకులు జెవి.రమణరాజు, ఐఎఫ్‌టియు పట్టణ కార్యదర్శి మొల్లేటి శ్రీను మాట్లాడారు. తొలుత పాత పంచాయతీ ఆఫీస్ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుండి ఆర్‌టిసి బస్టాండ్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ సంఘాల నేతలు బి.బాలరాజు, సూర్యకిరణ్, ఎస్‌కె.మాబుసుభాని, అందుగుల ప్రభాకర్, కంతేటి వెంకట్రావు, నిమ్మల సుబ్బారావు, బొక్కా శ్రీనివాస్, పితాని సురేష్‌బాబు, కె.ప్రతాప్, ఉకే వీర్రాజు, కాకి నాగరాజు, గుజ్జు రమేష్‌బాబు, కె.రామలక్ష్మి, ఎడ్లపల్లి బుజ్జియ్య, గణేష్, ఎస్.యేసు, గంపల వెంకటేష్ నాయకత్వం వహించారు.

నూజివీడు టౌన్: సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో పట్టణంలో సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుండి పొట్టి శ్రీరాములు విగ్రహం, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, హనుమాన్ జంక్షన్ రోడ్డు మీదుగా ఆర్‌టిసి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, ఎఐటియుసి నాయకులు చలసాని రామారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, నేత నిమ్మగడ్డ నరసింహ మాట్లాడారు. మోడీ విధానాల ఫలితంగా దేశంలో పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కార్పొరేట్ కుటుంబాల ఆస్తులు, సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతోందన్నారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి వివిధ సంఘాల నాయకులు పి.శోభనాద్రి, సిపిఆర్, పి.జమలయ్య, కృష్ణారావు, నాగరాజు తదితరులు నాయకత్వం వహించారు.

చింతలపూడి: సార్వత్రిక సమ్మె చింతలపూడిలో విజయవంతమైంది. కార్మికులు విధులు బహిష్కరించి రోడ్డెక్కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినదించారు. సిఐటియు, ఎఐటియుసి నాయకత్వంలో కార్మికులు స్థానిక బైపాస్ రోడ్డు నుండి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సభకు ఎఐటియుసి నాయకులు తుర్లపాటి బాబు, సిఐటియు నాయకులు నత్త వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల ద్వారా యజమానులకు మేలు, కార్మిక వర్గానికి కీడు తలపెట్టిన ఘనత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. కార్మిక వర్గం కదం తొక్కడాన్ని చూసైనా మోడీ ప్రభుత్వం తక్షణం లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. కౌలురైతు సంఘం జిల్లా నాయకులు దొంత కృష్ణ మాట్లాడుతూ సమ్మెలో రైతులు కూడా పాల్గొంటున్నారని, కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ మండల నాయకులు షేక్ కాలీషా మాట్లాడారు. కార్యక్రమానికి వివిధ సంఘాల నేతలు పి.బాలకృష్ణ, గంధం అంజమ్మ, ఎన్.సరోజిని, సిహెచ్.పుణ్యవతి, బి.సరళ, ఆమని, కృష్ణవేణి, ఝాన్సీ, వి.అనురాధ, టి.వల్లీ, వంశీ, టి.రాజు, లాజరు, సత్యనారాయణ, పాండురంగారావు తదితరులు నాయకత్వం వహించారు.

భీమడోలు రూరల్: మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని భీమడోలులో కార్మిక వర్గం గర్జించింది. తొలుత సిఐటియు మండల కార్యాలయం నుండి భీమడోలు జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్షురాలు జి.స్వర్ణకుమారి అధ్యక్షతన జరిగిన సబలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడారు. కార్మికులను మరింత బానిసలుగా మార్చేందుకే మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, వాటిని రద్దు చేయకుంటే ఇలాంటి సమ్మె నిరవధికంగా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నేతలు కె.వెంకటేశ్వరరావు, పద్మ, చల్లా మణి, నయోమి, శ్రీనివాసరావు, దుర్గారావు, అనిల్, వీరయ్య తదితరులు నాయకత్వం వహించారు.

బుట్టాయిగూడెం: లేబర్‌కోడ్‌ల రద్దు కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆశాలు, విఒఎలు, విఆర్ఎలు, మధ్యాహ్న భోజన, వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందుల ధరలు తగ్గించాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి పని బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు మారాయమ్మ, కె.పుష్ప, రామలక్ష్మి, సుధా, వీరమణి, బుల్లెమ్మ, భీమరాజు, సత్యనారాయణ, అనూష, రాణి తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో



చింతలపూడి: మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి



భీమడోలులో ర్యాలీ



బుట్టాయగూడెం: మాట్లాడుతున్న ఎం.నాగమణి



నూజివీడులో ర్యాలీ



ఏలూరులో నేతల అభివాదం

ఎన్నికలు ఎగ్గొట్టి.. త్రిసభ్య కమిటీలు..!

2018 నుంచి సహకార సంఘాలకు ఎన్నికలు నిల్

వైసిపి దారిలోనే కూటమి సర్కార్

రాజకీయ పునరావాస కేంద్రాలుగా సహకార సంఘాలు

ఏలూరు జిల్లాలో 159కుగాను 34 సంఘాలకు కమిటీలు నియామకం

పశ్చిమలో 122కుగాను ఒక సంఘానికి కమిటీ ఏర్పాటు

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వాలు విఫలం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా సహకార సంఘాలకు రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన ఎన్నికలు మాత్రం నిర్వహించని పరిస్థితి నెలకొంది. సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చేసిన పరిస్థితి ఉంది. 2018 నుంచి ఇప్పటి వరకూ సహకార సంఘాలకు రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీల పేరుతో ప్రభుత్వాలు సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుతో సహకార సంఘాల్లో అవినీతి మరింత పెచ్చుమీరుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కూటమి సర్కార్ సైతం సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ తొలిజాబితా విడుదల చేయడంపై రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. దీంతో ఎన్నికలు ఎగ్గొటి త్రిసభ్య కమిటీలను నియమించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో 159 సహకార సంఘాలు ఉండగా, పశ్చిమగోదావరి జిల్లాలో 122 మొత్తం 281 సహకార సంఘాలు ఉన్నాయి. జిల్లాలో రైతులకు సహకార సంఘాలు ఎంతో దన్నుగా నిలుస్తున్నాయి. లక్షలాది మంది రైతులు సహకార సంఘాల్లో రుణాలు తీసుకుని వ్యవసాయం సాగిస్తున్న పరిస్థితి ఉంది. సహకార సంఘాలకు రాజ్యాంగబద్ధంగా ఐదేళ్లకొకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. సహకార సంఘాల అధ్యక్షులను, డైరెక్టర్లను అందులోని సభ్యులు తమ ఓటు ద్వారా ఎన్నుకుంటారు. ప్రతి సహకార సంఘానికి 12 మంది వరకూ డైరెక్టర్లు ఉంటారు. ఎస్‌టి కోటా ఉన్నచోట 13 మందితో కమిటీ ఉంటుంది. 2013 జనవరిలో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించింది. 2018 జనవరితో వాటి పదవీ కాలం ముగిసింది. అప్పట్లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం సాధారణ ఎన్నికలు దగ్గర పడటంతో పదవీకాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ముందుకు సాగిపోయింది. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీని నియమించింది. ఒకరిని ఛైర్మన్‌గా, ఇద్దరు సభ్యులను ఏర్పాటు చేసి ఐదేళ్లు కాలక్షేపం చేసింది. అప్పట్లో దీనిపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

వైసిపి బాటలోనే కూటమి సర్కార్

2024 ఎన్నికల్లో కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో వైసిపి ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలను రద్దు చేసింది. ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో సహకార ఎన్నికలు జరగడం ఖాయమని అంతా భావించారు. ఏడాది తర్వాత ఎన్నికలకు తిలోదకాలు ఇచ్చేసి త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు పూనుకుంది. దీనిలో భాగంగా తొలివిడతగా ఏలూరు జిల్లాలో 34 సంఘాలకు త్రిసభ్య కమిటీలను ప్రకటించింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్క సంఘానికే మాత్రమే కమిటీని నియమించింది. రెండో జాబితాలో మరిన్ని సంఘాలకు కమిటీలను నియమించనున్నట్లు తెలుస్తోంది. తొలి జాబితాలో అత్యధికంగా టిడిపి వారికే అవకాశం ఇచ్చినట్లు చెబుతున్నారు. జులై నెలాఖరులోగా త్రిసభ్య కమిటీల నియామకం పూర్తికావొచ్చని అధికారులు చెబుతుండగా, రాజకీయ నాయకులు మాత్రం రెండు, మూడు రోజుల్లోనే మరో జాబితా వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సహకార పదవులపై ఆశలు పెట్టుకున్న వారిలో టెన్షన్ నెలకొంది. త్రిసభ్య కమిటీల నియామకం కారణంగా రైతులకు ఏవిధమైన న్యాయం జరగడం లేదు. తాము ఓటువేసి గెలిపించిన నాయకులను అయితే వెళ్లి నిలదీసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నియమించడంతో రైతులకు సరైన సమాధానం చెప్పడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చడంపై రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

యథాతథంగా కోడూరు యుపి స్కూల్

గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం

ప్రజాశక్తి వరుస కథనాలకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కోడూరు యుపి స్కూలును యథాతథంగా కొనసాగిస్తూ విద్యాశాఖాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 6, 7, 8 తరగతులను రద్దు చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాల పునః ప్రారంభం నుంచి ఆందోళనలు సాగిస్తున్న విషయం తెలిసిందే. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించారు. మా స్కూల్ మాకే కావాలంటూ కోడూరు పాఠశాలలో ప్రతిరోజూ విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై 'ప్రజాశక్తి'లో గత నెలలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు గత నెల 30న కోడూరు స్కూలు సందర్శించి, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కోడూరు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు రాసిచ్చిన తీర్మానాన్ని, విద్యార్థుల దూరాభారాన్ని దృష్టిలో పెట్టుకుని స్కూలు పరిస్థితిని డివైఇఒ నిమ్మగడ్డ రవీంద్రభారతి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈ క్రమంలో డిఇఒకు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు నుంచి కోడూరు స్కూలును యుపి స్కూలుగా కొనసాగించాలని ఉత్తర్వులు వచ్చాయి. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు వల్లభనేని శివాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌కు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన (ఫైల్‌ఫోటో)

స్కూల్‌లో చెట్టుకొమ్మ పడి

విద్యార్థులు ఆసుపత్రి పాలు..!

ఆలస్యంగా వెలుగులోకి శనివారపుపేట హైస్కూల్‌లో ఘటన

ఒక విద్యార్థినికి విరిగిన కాలు, మరో విద్యార్థినికి చేయి

పది మంది స్వల్ప గాయాలతో బయట పడిన పరిస్థితి

విద్యాశాఖ, ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చెట్టు కింద పాఠాలు బోధిస్తుండగా కొమ్మ విరిగి పడటంతో పదిమందికిపైగా విద్యార్థులు గాయాలతో ఆసుపత్రి పాలైన ఘటన శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం చోటుచేసుకుంది. విద్యార్థులకు గుట్టుగా చికిత్స చేయించడంతో ఈ విషయం బుధవారం వరకూ వెలుగు చూడలేదు. శనివారపుపేట హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులను స్కూల్ గ్రౌండ్‌లోని చెట్టుకింద కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా చెట్టుకొమ్మ విరిగి విద్యార్థులపై పడింది. దీంతో పది మందికిపైగా విద్యార్థులు గాయాల పాలయ్యారు. ప్రభుత్వాసుపత్రికి తీసుకొస్తే విషయం బయటికి పొక్కుతుందనే ఆలోచనతో ఏలూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి గాయాలైన విద్యార్థులను ఆటోలో తరలించారు. పది మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స చేసి ఇంటికి పంపించారు. ఎనిమిదో తరగతి విద్యార్థికి చెయ్యి విరగడంతో సిమెంట్ కట్టు వేసి ఇంటికి పంపించినట్లు తెలిసింది. కావ్య అనే మరో విద్యార్థినికి కాలు మడమ విరిగింది. దీంతో ఆపరేషన్ చేయాల్సిన అవసరం పడటంతో సదరు విద్యార్థినిని వంగాయగూడెంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఆ ఆసుపత్రిలో విద్యార్థిని చేరిన తర్వాత స్కూల్ ఉపాధ్యాయులు సరిగా పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థినికి ఆరోగ్యశ్రీలో బుధవారం సాయంత్రం ఆపరేషన్ జరిగింది. ఇంత పెద్ద ఘటన జరిగినప్పటికీ విద్యాశాఖ అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంపై అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖాధికారులు ఎవరూ కనీసం ఆసుపత్రిలో ఉన్న విద్యార్థిని వద్దకు వెళ్లకపోవడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. విద్యార్థిని తల్లిదండ్రులు రోజువారీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. విద్యార్థిని తల్లి పలు ఇళ్లలో పనులు చేస్తూ పిల్లలను చదివించుకుంటున్న పరిస్థితి. విద్యార్థినికి ఆపరేషన్ చేసే పరిస్థితి వచ్చినా ఉపాధ్యాయులనుంచిగాని, విద్యాశాఖాధికారుల నుంచిగాని ఇప్పటి వరకూ ఎటువంటి ఆర్థిక సాయం అందలేదు. వైద్యం ఆరోగ్యశ్రీలో అందించినప్పటికీ ఇతర ఖర్చులు అనేకం అవుతాయి. ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు. శనివారపుపేట హైస్కూల్ ఘటనపై డిఇఒ వెంకటలక్ష్మమ్మను ప్రజాశక్తి ప్రశ్నించగా చిన్నచిన్న గాయాలు మాత్రమే అయ్యాయని చెప్పారని, పూర్తి వివరాలు తెలుసుకుంటానని తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో గాయపడిన వృద్ధురాలు మృతి


జీలుగుమిల్లి: మూడు రోజుల క్రితం పిచ్చికుక్క దాడి లో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు భూక్యా నీలిమ (62) ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని తాటియాకులగూడెం సమీపంలోని ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు వద్ద పూలకొట్టు నడు పుకుంటూ జీవనం సాగిస్తున్న నీలిమను ఆదివారం తెల్లవారుజామున పిచ్చి కుక్క తీవ్రంగా గాయపరిచింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పెరుగుతున్న గోదావరి ఉధృతి

పోలవరం స్పిల్వే నుండి 2,27,066 క్యూసెక్కుల జలాలు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి వరద ఉధృతి బుధవారం సాయంత్రానికి మరింత పెరిగింది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలు, గోదావరి ఉపనదుల జలాలు, కొండవాగుల జలాలతో గోదావరిలో నీటిమట్టం వేగంగా పెరుగుతూ వస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 24 అడుగులకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలోకి చేరుకున్న 2,27,066 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 28.250 మీటర్లు, దిగువన 18.680 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన 28.400 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన 17.750 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 15.990 మీటర్లు నీటిమట్టం నమోదైంది. గోదావరి జలాలు స్పిల్వే 48 గేట్ల నుండి దిగువకు వేగంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు దిగువన పోలవరం నుండి పట్టిసీమ వరకూ నీటిమట్టం 26.987 మీటర్లుగా నమోదైనట్లు గురువారం నాటికి 2.82 లక్షల క్యూసెక్కుల జలాలు గోదావరిలోకి రానున్నట్లు అంచనాలు చెబుతున్నాయని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.



రుద్రంకోట వద్ద పడవ రేవులోకి వచ్చిన వరద నీరు

కుక్కునూరు రూరల్: వారం రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్తున్న గోదావరి వరద రెండు రోజుల నుండి పెరుగుతూనే ఉంది. దీంతో ముంపు మండలాల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

వేలేరుపాడు రూరల్: గోదావరి వరద రోజురోజుకీ పెరుగుతుండటంతో గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రుద్రంకోట, రేపాకగొమ్ము, తదితర ప్రాంతాల్లోని నిర్వాసితులు మెరక ప్రాంతాల్లోకి, చల్లావారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోకి తమ సామాన్లను ట్రాక్టర్లపై, ఆటోలపై తరలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

అక్షరాస్యత పెంచడమే లక్ష్యం

97,200 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

వయోజనుల్లో అక్షరాస్యతను పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవం తం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక కలెక్టర్ బంగ్లాలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి ఉల్లాస్-అక్షరాంధ్ర జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వంద గంటల శిక్షణతో ఈ ఏడాది 97,200 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో చేపట్టి, జిల్లాను ప్రథమస్థానంలో ఉంచాలన్నారు. గతేడాది నిర్వహించిన ఈ కార్యక్రమం అమల్లో ఏలూరు జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉందన్నారు. 2023లో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా జిల్లాలో 15-59 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగిన 3,16,441 మంది నిరక్షరాస్యులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తించామన్నారు. జిల్లాలో తొలి విడతగా 2025-26లో ఆసక్తిగల 97,200 మంది వయోజనులైన నిరక్షరాస్యులను ఎంపిక చేసి వారందరిని అక్షరాస్యులుగా చేయడానికి సంబంధిత శాఖల ద్వారా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. తదుపరి మూడు సంవత్సరాల్లో మొత్తం 3,16,441 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసి ఏలూరు జిల్లాను అక్షరాస్యతలో మొదటి స్థానంలోకి తీసుకుని రావాలని సూచించారు. జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ గత సంవత్సరం 7,321 మందిని గుర్తించి 7,286 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దామన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ శ్రీహరి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ ఇఇ మల్లిక, వయోజన విద్య ఎపిఒ విజయకుమార్, జిల్లా పంచాయతీ, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆహార కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. ద్వారకాతిరుమల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని భోజనశాలలో ఆహార నాణ్యతను బుధవారం ఆయన పరిశీలించారు. సరుకులు నాణ్యత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన సరుకులు వినియోగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కిచిడి స్థానంలో ఎగ్‌రైస్ పెట్టాలని వంట సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఎంఎల్‌ఎను కలిసిన సొసైటీ కమిటీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో నారాయణపురం సొసైటీ త్రి సభ్య కమిటీ ఎంఎల్‌ఎ ధర్మరాజును బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా ఉంగుటూరు మండలం కాగుపాడుకు చెందిన కడియాల రవిశంకర్ నియమితులయ్యారు. సభ్యులుగా నల్లమాడు పంచాయతీ పరిధి రామచంద్రపురం జనసేన నాయకుడు గౌతు బాల భాస్కర్, నీలాద్రిపురం టిడిపి నాయకుడు బొత్తా దుర్గారావులును నియమితులయ్యారు. ఈ మేరకు తమకు అవకాశం ఇచ్చినందుకు వారు ఎంఎల్‌ఎను కలిసి అభినందనలు తెలిపారు.

నేడు సొసైటీ త్రిసభ్య కమిటీ బాధ్యతలు స్వీకరణ

నారాయణపురం సొసైటీ త్రిసభ్య కమిటీ గురువారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొనే కార్యక్రమంలో బాధ్యత, ప్రమాణ స్వీకారం చేయనున్నామని కడియాల రవిశంకర్ తెలిపారు.

రోడ్డు నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రీన్ ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ మోసం చేశారని శెట్టివారిగూడెం, వెంకటాపురం గ్రామస్తులు హైవేపై టెంట్ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు అనుసంధానంగా వందేళ్లుగా ఉన్న రోడ్డును గ్రీన్ ఫీల్డ్ హైవే వారు ధ్వంసం చేశారని, దీనిపై వారు రోడ్డు నిర్మిస్తామని మాట ఇచ్చి ఇప్పుడు సంబంధం లేనట్టుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే హైవే పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని విజరం పంచాయతీ వెంకటరెడ్డిగూడెం గ్రామానికి రోడ్డు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ వెంకటరెడ్డిగూడెం గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక గిరిజనులు తీవ్ర అవస్థలు గురవుతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే విజరం నుంచి వెంకటరెడ్డిగూడెం, వెంకటరెడ్డిగూడెం నుంచి రామన్నపాలెం వరకు తారు రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. వెంకటరెడ్డిగూడెం పిసా కమిటీ ఉపాధ్యక్షులు కొమరం రామారావు మాట్లాడుతూ ఈత కాలువపై వంతెన (బ్రిడ్జి) నిర్మించాలన్నారు. అనంతరం ఎంపిడిఒ శ్రీనివాస్‌బాబుకు వినతిపత్రం అందించారు.

బోరు వేసేందుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని పి.కన్నాపురం పంచాయతీ దాడవల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.ఆరు లక్షలతో నూతన బోరు వేసేందుకు టిడిపి మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. కామయ్యపాలెంలో మండల పరిషత్, పంచాయతీ నిధులు రూ.8.4 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి, చెరువు కట్టల్లో నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోడిక బోగేశ్వరరావు, ఎంపిడిఒ నిఖిల్ మధు శరత్ జనసేన, టిడిపి నేతలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ద్వారకాతిరుమల :ఎంటిఎస్, హెచ్‌ఆర్ పాలసీ, సమ్మె అగ్రిమెంట్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని భారం తగ్గించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఇపిఎఫ్, హెల్త్ కార్డులు ఇవ్వాలని, మెడికల్ లీవులు ఇవ్వాలని కోరారు.

పట్టిసీమ నుంచి 5,564 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం :పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 5,564 క్యూసెక్కుల నీటిని పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఇఇ ఏసుబాబు బుధవారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 15 మీటర్లకు పైగాఉండడంతో 16 మోటార్లు 16 పంపుల ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

తాటకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

దిబ్బగూడెంలో బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు షార్ట్ షార్క్యూట్ జరిగి ముచ్చిక చిలకమ్మకు చెందిన తాటకిళ్లు దగ్ధమైంది. స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగలేదు. ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు బాధితులు వాపోతున్నారు. నష్టపోయిన బాధిత కుటుంబానికి రెవెన్యూ, కూటమి నాయకుల ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

మల్లారంలో...

వేలేరుపాడు రూరల్ :మండలంలోని రామవరం గ్రామపంచాయతీ మల్లారంలో మడకం సుందరయ్య ఇల్లు ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. సుందరయ్య భార్య ఆశావర్కర్‌గా పని చేస్తున్నారు. ఆమె విధుల నిమిత్తం వేలేరుపాడు వెళ్లగా సుందరయ్య పొలం పనులకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సామన్లు, విలువైన వస్తువులు, సుమారు రూ.50 వేల నగదు దగ్ధమయ్యాయి. సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. బాధితులకు సిపిఐ, ఎఐటియుసి, ఆశా వర్కర్ల అధ్వర్యంలో బియ్యం, దుస్తులు, రూ.వెయ్యి నగదు అందించారు.


టి.నరసాపురంలో...



ఏలూరులో...



పెదవేగిలో...


దెందులూరులో...



లింగపాలెంలో...

సార్వత్రిక సమ్మె విజయవంతం

- భారీగా పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ఉద్యోగులు
- పెద్దఎత్తున ర్యాలీలు, మానవహారాలు
- స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని స్పష్టం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. జిల్లావ్యాప్తంగా కార్మిక సంఘ నాయకులు, కార్మికులు, ఉద్యోగులు భారీగా పాల్గొని సమ్మెను జయప్రదం చేశారు. పెద్దఎత్తున ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని, పది గంటల పని విధానాన్ని రద్దు నినాదాలు చేశారు. స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏలూరులో అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఎల్‌ఐసి ఏలూరు బ్రాంచి-1 ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో బేస్ యూనిట్ సభ్యులు, విశ్రాంతి ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. నగరంలో చేపట్టిన మహాధర్నాకు ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు మద్దతు తెలిపి, నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పవర్ పేట రైల్వే స్టేషన్ నుంచి రమా మహల్ సెంటర్ మీదుగా ఆర్ఆర్ పేట పార్క్ వద్దకు నిరసన ప్రదర్శన చేశారు. పలు కార్మిక కార్మిక సంఘాల నేతలు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.శంకర్రావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ జబీర్, వైవి.హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు టి.వెంకట్రావు, డి.సత్యనారాయణ, గంగరాజు, సిహెచ్.ప్రతాప్, పి.మిల్టన్ పాల్గొన్నారు. న్యాయవాదులు జిల్లా కోర్టులో విధులు బహిష్కరించి సమ్మెకు సంఘీభావం తెలిపారు. **టి.నరసాపురంలో** ఆశా, అంగన్వాడీ, మిడ్ డే మీల్స్, రవాణా రంగం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు, సిఐటియు నాయకులు అనుమోలు మురళి, విజయలక్ష్మి, ఝాన్సీ, వర్కర్స్ యూనియన్ లీడర్లు పాల్గొన్నారు. **పెదవేగిలో** స్థానిక తురాయి సెంటర్ నుంచి ర్యాలీ చేసి గ్రామీణ బ్యాంకు వద్ద మానవహారం నిర్వహించి అనంతరం సభ నిర్వహించారు. ఈ సభకు ఎం.కృష్ణవేణి అధ్యక్షత వహించగా జిల్లా నాయకులు ఎ.శ్యామలారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ప్రసాద్, మండలాధ్యక్షులు బైగాన్ని రమేష్, కె.అనురాధ, టి.మల్లిక, ఎం.నిర్మల బేబీ సరోజిని, టి.ఆంజనేయులు, బి.రోజా, ఎ.వల్లి, ఎన్.తులసి, బి.సుబ్బారావు మౌనిక పాల్గొన్నారు. **ద్వారకాతిరుమలలో** కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి అక్కడ నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ జరిగిన సభకు సిఐటియు మండల కార్యదర్శి ఆదికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సిఐటియు మండల నాయకులు పెద్దిరాజు, తులసి, సిఐటియు మండల నాయకులు అనంతలక్ష్మి, ధనలక్ష్మి, లలిత, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మానుకొండ వీర్రాజు, డివైఎఫ్ఐ నాయకులు నాగరాజు పాల్గొన్నారు. **పోలవరంలో** రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపుమేరకు స్థానిక గంగాభవాని థియేటర్ నుంచి ఏటుగట్టు వరకు నిరసన ప్రదర్శన చేసి అక్కడ రాస్తారోకో నిర్వహించారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రామారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాషా, ఆదివాసి గిరిజన సంఘం కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడారు. సమ్మెకు పోలవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సొబ్బన రాజశేఖర్ బాబు, క్లబ్ సభ్యులు సంఘీభావం తెలిపారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు. **నిడమర్రులో** సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో బిల్డింగ్ వర్కర్స్, అంగన్వాడీ, హమాలీ కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. కోన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమణారావు, గవర సత్యనారాయణ, గోక సూరిబాబు, చిన్నమిల్లి రాంబాబు, ఎ.నాగమణి తదితరులు పాల్గొన్నారు. **కుక్కునూరు రూరల్‌లో** సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు 200 మంది స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ చేశారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సమ్మెలో సిఐటియు మండల కార్యదర్శి వై.సాయికిరణ్, బాడీస సుజాత, నాగలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు, గిరిజన సంఘం మండల నాయకులు పట్ల లక్ష్మయ్య, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు పాల్గొన్నారు. **కామవరపుకోటలో** ప్రధాన వీధుల్లో ర్యాలీ చేసి చౌతన సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బుచ్చిబాబు, టివిఎస్.రాజు, అంగన్వాడి వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **కొయ్యలగూడెంలో** సిఐటియు ఆధ్వర్యంలో వెంకటేశ్వర థియేటర్ వద్ద ఆందోళన, సభ నిర్వహించారు. సభకు చుక్కల రాంబాబు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా నాయకులు పి.మంగరాజు, సొసైటీ జిల్లా కమిటీ అధ్యక్షులు కెవి.సత్యనారాయణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు తులసి నలిని, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పోల రావులమ్మ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.శివ, కె.సీతారాములు, ఆకుల దుర్గారావు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై సిపిఎం, సిఐటియు, ఐఎఫ్‌టియు, సిపిఐ, ఎఐటియుసి, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, రెడ్ స్టార్, ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో, ర్యాలీ చేశారు. **ముదినేపల్లిలో** మండల పరిషత్ కార్యాలయం నుంచి వై సెంటర్ వరకు ఆశా, అంగన్వాడీ, స్కూల్ వర్కర్స్, మిడ్ డే మీల్స్, పంచాయతీరాజ్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, సిఐటియు నాయకులు అరుణకుమారి, పద్మ, జ్యోతి, దాకరపు నాగేశ్వరరావు, రాధాకృష్ణ, సీతమ్మ, హేమ, విజయలక్ష్మి, పావని పాల్గొన్నారు. **జీలుగుమిల్లిలో** ప్రజాసంఘాలు, సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా, భవన నిర్మాణ కార్మికులు ప్రజా సంఘాల కార్యాలయం నుంచి ప్రధాన జాతీయ రహదారి వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, సిహెచ్.కొండలరావు, భూషణం, సీతారామయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. **ఉంగుటూరులో** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆయాలు, లిక్కర్ పరిశ్రమ, టైల్స్ పరిశ్రమ కార్మికులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. హైవేపై మానవహార ప్రదర్శనలతో ట్రాఫిక్ స్తంభింపజేశారు. సిఐటియు నాయకులు గుత్తికొండ కృష్ణారావు, సీరా అప్పారావు, కొర్ని అప్పారావు, యుటిఎఫ్ నాయకులు కూన కమల్ కుమార్, అంగన్‌వాడీ నాయకులు పాల్గొన్నారు. **లింగపాలెంలో** సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబూరావు, జయరాజు, సిఐటియు నాయకులు బిజెఎన్.కుమారి, ఈశ్వరి, ఎస్‌కె.షరీఫ్, మస్తాన్, అంగన్వాడీ ఆశా విఒఎ, వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు. **కైకలూరులో** సిఐటియు ఆధ్వర్యంలో స్కీమ్ వర్కర్లు, కార్మికులు ఎంపిడిఒ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా భారీ ర్యాలీ చేశారు. రాస్తారోకో, మానవహారం కార్యక్రమాలు చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి లాజరు అధ్యక్షతన సభ నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. **మండవల్లిలో** అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మిడ్ డే మీల్ సిబ్బంది, ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని మండవల్లి ప్రధాన సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, మండల కార్యదర్శి చెల్లాయమ్మ పాల్గొన్నారు. **ఆగిరిపల్లిలో** మెయిన్ సంటర్‌లో సిఐటియు, సిపిఎం, ఆశా, అంగన్వాడీ, పలు ప్రజాసం ఘాల ఆధ్వర్యంలో మానవహా రం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు, సిఐటియు మండల కార్యదర్శి ఆర్.చంటి పాల్గొన్నారు. సహకార కేంద్ర బ్యాంక్ వద్ద ఎపి పాక్స్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.రమేష్‌బాబు, మండల ఆర్గనైజర్ రవీంద్ర, పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు. **చాట్రాయిలో** ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, తాపీ కార్మికులు సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు రాంబాబు, టిఎన్ఎం.సూరి, సిపిఎం నాయకులు చాగంటి రాజారావు, గజవెల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ముసునూరులో** సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు, అంగన్‌వాడీలు, భవన నిర్మాణ కార్మికులు మండపం సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొడవలి శ్రీనివాస్, పి.రాజకుమారి, చిన్నారి, సత్యవాణి, విద్యావతి, దుర్గ, శ్రీను, కంచర్ల రమేష్, కంచర్ల శివప్రసాద్ పాల్గొన్నారు. **వేలేరుపాడు రూరల్‌లో** సిఐటియు, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) ప్రజా పంథా ఆధ్వర్యంలో స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు, సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా నాయకులు ఎస్.లత, సిఐటియు మండల కార్యదర్శి బొగారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **కలిదిండిలో** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా, బిల్డింగ్ వర్కర్స్, హమాలీలు, స్కూల్ స్వీపర్స్, మిడ్డేమీల్స్ కార్మికులు, విఆర్ఎలు, పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు ఎస్.మహంకాళిరావు, జక్కుల మహేష్, షేక్ అబిదాబేగం, పరసా రాజేష్ పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో...


బుట్టాయగూడెంలో...


చాట్రాయిలో...



ద్వారకాతిరుమలలో...



జీలుగుమిల్లిలో...


ఉంగుటూరులో...


కామవరపుకోటలో...


కలిదిండిలో...


కొయ్యలగూడెంలో...


కుక్కునూరులో...


మండవల్లిలో...



మండవల్లిలో...


ముసునూరులో...



నిడమర్రులో...


పోలవరంలో...


వేలేరుపాడులో...

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

ముసునూరు :మండలంలోని రమణక్కపేట అరుంధతి నగర్‌లో 15 రోజులుగా పంచాయతీ బోరు మోటార్ చెడిపోయి ప్రజలు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సంఘం మండల కార్యదర్శి వేముల బక్కయ్య మాట్లాడుతూ పంచాయతీ మోటార్‌కు మరమ్మతులు చేయడంలేదని, కనీసం ట్యాంకర్లతో ప్రజల దాహార్తిని తీర్చకుండా పంచాయతీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఎంపిడిఒ స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నందిపాము రాణి, జుజ్జువరపు మహారాణి, నందిపాము సరమ్మ, మందా మార్తమ్మ, నందిపాము చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన

ద్వారకాతిరుమల :ద్వారకాతిరుమల గ్రామీణ తపాలా ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం పోస్టాఫీస్ గేటు వద్ద నిరసన చేపట్టారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

అబ్బయ్యచౌదరి లీజు సొమ్ము చెల్లించాలి

పోలీస్ స్టేషన్ ఎదుట కొల్లేరు మహిళలు, కూటమి నాయకుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మాజీ ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి కొల్లేరులో చేపల చెరువులను లీజుకు తీసుకుని రూ.కోట్ల లీజు సొమ్ము చెల్లించలేదని కొల్లేరు గ్రామాల మహిళలు, కూటమి నాయకులు బుధవారం ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. అబ్బయ్యచౌదరి చెరువుల లీజు చెల్లించాలని, శ్రీపర్రు, కోమటిలంక తదితర గ్రామాల మహిళలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నాలో కూర్చున్నారు. ధర్నాకు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ సంఘీభావం తెలిపారు. కొల్లేరు సంఘ నేతలు సైదు సత్యనారాయణ, ఏలూరు రూరల్ క్లస్టర్ ఇన్‌ఛార్జి నేతల రవి, టిడిపి రూరల్ మండలాధ్యక్షుడు నంబూరు నాగరాజు మాట్లాడుతూ దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ కొల్లేరు గ్రామాల ప్రజలకు చెల్లించాల్సిన రూ.పది కోట్లు చెల్లించని పక్షంలో కొండలరావుపాలెంలో అబ్బయ్య చౌదరి ఇంటి ఎదుట ధర్నాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టి తమ నిరసన తెలిపారు.

మట్టి తరలింపును అడ్డుకున్న ఇరిగేషన్ డిఇ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని పెద్ద చెరువులో నియమ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న కొందరు వ్యక్తులపై ఇరిగేషన్ డిఇ అర్జున్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద చెరువులో మూడు జెసిబిలను ఏర్పాటు చేసి 50కి పైగా ట్రాక్టర్లతో అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో డిఇ అర్జున్‌రావు, ఎఇ సలీంలతో కూడిన బృందం అక్కడికి చేరుకని మట్టి తరలింపును అడ్డుకున్నారు. మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవంటూ ఘాటుగా హెచ్చరించారు.


పలుచోట్ల 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి ఏలూరు సిటీ

స్థానిక 47వ డివిజన్‌లో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పర్యటించారు. డివిజన్ సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు :సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలంలోని బాపిరాజుగూడెం, రామచంద్రపురం, నడిపల్లి, విజయరాయి గ్రామాల్లో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందించారు.

ఆగిరిపల్లి : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టిడిపి మండలాధ్యక్షులు నక్కనబోయిన వేణు అన్నారు. మండల పరిధిలోని మల్లిబోయినపల్లిలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ, ఇంటింటికీ కరప్రతాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నూగొండపల్లి గ్రామ అధ్యక్షులు మట్టా వేణు, మాజీ తెలుగుయువత అధ్యక్షులు నలజాల హరిబాబు, మోర్ల నాగరాజు పాల్గొన్నారు.


ఆగిరిపల్లిలో...